క్లుప్తంగా

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దాతల సహాయ సహకారాలు అభినందనీయమని జీవీఎస్‌విఆర్‌ఎం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేట ఏవీఎస్‌ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం దాత కామిశెట్టి అయ్యప్పనాయుడు సౌజన్యంతో 100 ప్లేట్లు, మూడు బిందెలు, మూడు బకెట్లు, ఒక స్టీల్ వాటర్ డ్రమ్ము, గరిటెలను హెచ్‌ఎంకు అందజేశారు. ఏవీఎస్ఎస్ పాఠశాల హెచ్‌ఎం ఎం.సురేష్ మాట్లాడుతూ తమ పాఠశాలకు విద్యార్థుల కోసం భోజన సామగ్రిని దాతల ద్వారా ఏర్పాటు చేయడానికి కృషి చేసిన హెచ్ ఎం భవానీప్రసాద్‌కు, దాత అయ్యప్పనాయుడులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కిశోర బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించాలి



ప్రభుత్వాస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న శరభేశ్వర ప్రసాద్

మొగల్తూరు: కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు తరుచూ నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యో శాఖ గణాంకాధికారి ఎం.శరభేశ్వర ప్రసాద్ సూచించారు. మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన పరిశీలించి డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిశు మరణాలకు కారణం బాల్య వివాహాలతో పాటు రక్తహీనతే ప్రధాన కారణమన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలకు ఐరన్ మాత్రలు అందించడం ద్వారా రక్తహీనత సమస్యను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్, డాక్టర్ లక్ష్మీ పార్వతి, ఆసుపత్రి సిబ్బంది శ్రీనివాస్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతం మాజీ సర్పంచ్ రత్నంరాజు మృతి



రత్నరాజు

పెనుగొండ: సిద్ధాంతం మాజీ సర్పంచ్ బిరుదగంటి రత్నరాజు(55) గురువారం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. రాజమండ్రి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 20 ఏళ్ల పాటు సిద్ధాంతం ప్రాథమిక వ్యవసాయ సహకార పర పతి సంఘ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. అనంతరం 2014-2019 వరకూ సిద్ధాంతం సర్పంచ్‌గా గ్రామాభివద్ధిలో తనదైన ముద్ర వేశారు. సిద్ధాంతంలోని స్వగృహంలో రత్నరాజు మృతదేహానికి కాకినాడ కోర్టు మెజిస్ట్రేట్ భీర శ్రీను, నిడదవోలు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నక్కా అజయ్‌కుమార్, మండ పేట సీఐ దొరరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నల్లపరాజు వేణుగోపాల ఆదినారాయణ రాజు(దొరబాబు), భీమవరం అసిస్టెంట్ రిజిస్ట్రార్ జంగం వెంకటేశ్వరరావు, సర్పంచ్ చింతపల్లి గనిరాజు, ఎఫ్ఎల్‌సీ చైర్మన్ చింతపల్లి జెమ్స్, తానేటి సత్యానందం, తూటే రాజారావులు నివాళులర్పించారు.

ఘనంగా లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పెనుగొండ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

పెనుగొండ: పెనుగొండ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం మాస్టర్ మైండ్ స్కూ లులో నిర్వహించారు. నూతన అధ్యక్షుడుగా జక్కం విజయ్, కార్యదర్శి గుమ్మడి చంటి, కోశాధికారిగా మండ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. పెనుగొండ లయన్స్ క్లబ్ నూతన కమిటి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని జిల్లా పస్ట్ వైస్ గవర్నర్ ఎస్‌వీవీఎస్ పాపారావు నాయుడు అన్నారు. కార్యక్రమంలో లయన్స్ గాజుల బులి పుల్లారావు, కొమ్ముల రామకృష్ణ, ఆసు వెంకటేశ్వరరావు, గుర్రాల శ్రీనులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు వెలకట్టలేనివి

నరసాపురం: సీపీఎం సీనియర్ నేత సీతారాం ఏచూరి సేవలు వెలకట్టలేనివని ఆ పార్టీ నాయకులు ఆయన మృతిపై సంతాపం తెలిపారు. గురువారం స్థానిక మీరా గ్రంథాలయం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు నారాయణరావు నివాళులర్పించారు. ఏచూరి పార్టీకోసం, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు.

వరద బాధితులకు సాయం

పాలకోడేరు: వరద బాధితుల సహాయార్థం పాలకోడేరు మండలంలోని రేషన్ డీలర్లంతా కలిసి పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు నగదును గురువారం పాలకోడేరు మండల తహసీల్దార్ నడింపల్లి భారతీ విజయలక్ష్మికు మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంగకృష్ణ అందజేశారు.

వశిష్ట గోదావరి మహోగ్రరూపం

- రోజురోజుకూ పెరుగుతున్న నీటిమట్టం
- నరసాపురానికి ముంపు ముప్పు



నరసాపురం: వశిష్ట గోదావరి వలందర్‌రేవు వద్ద భారీగా పెరిగిన నీటిమట్టం



నరసాపురం: అమరేశ్వరఘాట్ వద్ద నావలకు లంగరు వేసిన మత్స్యకారులు



యలమంచిలి: కనకాయలంకలో ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు



పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లంలో మాచేనమ్మ ఆలయం చుట్టూ చేరిన వరద

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి రోజురోజుకూ పెరుగుతుంది. మంగళ, బుధవారాలతో పోలిస్తే పోలిస్తే గురువారం నీటిమట్టం మరింతగా పెరిగింది. వలందర్‌రేవు పిండ ప్రదానం షెడ్డు ఫ్లోర్ మొత్తం నీటమునిగింది. ఇసుక ర్యాంపు ఏరియా నీటమునిగింది. లలితాంబ ఘాట్ వద్ద బాపూ విగ్రహం వరకూ వరద నీరు చేరింది. భద్రాచలం ఎగువప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సముద్రంలో వేగంగా నీరు కలుస్తుంది. అయితే సముద్ర పోటు సమయంలో నీటిమట్టం బాగా పెరుగుతుంది. పట్టణంలోని లాకుపేట, పొన్నపల్లి, మాధవాయిపాలెం నరసాపురం మండలంలోని నవరసపురం, పాత నవరసపురం ప్రాంతాలకు ముంపు గండం పొంచి ఉంది. అలాగే పట్టణ పరిధిలో గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న కాలనీలు పొన్నపల్లి, మాధవాయిపాలెం, లాకుపేట ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. గోదావరి ఉధృతి కారణంగా పట్టణంలోని మధవాయిపాలెం గోదావరి రేవులో పంటు రాకపోకలు సాగకపోవడంతో ప్రయాణికుల ఇక్కట్లు పడుతున్నారు. అలాగే చెక్క నావలపై గోదావరిలో వేట సాగించే సంప్రదాయ మత్స్యకారులు వరద కారణంగా ఖాళీ అయ్యారు. గోదావరి ప్రవాహ ఉధృతి కారణంగా వేట సాగకపోవడంతో నావలకు లంగరు వేశారు.

లంక గ్రామాలకు వరద భయం

యలమంచిలి: గోదావరి వరద లంక గ్రామాలను ముంచెత్తింది. అయితే భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టడంతో ఇక్కడ కూడా గోదావరిలో నీరు క్రమేపి తగ్గుతుంది. వరద నీరు గురువారం ఉదయం కనకాయలంక గ్రామంలోని ఇళ్ల మధ్యకు చేరుకుంది. దొడ్డిపట్ల, పెదలంక, లక్ష్మీపాలెం గ్రామాల్లోని మత్స్యకార కాలనీల చుట్టూ వరద నీరు వచ్చింది. యలమంచిలిలంక గ్రామ ప్రధాన రహదారి మీదకు వరద వచ్చింది. అయితే మధ్యాహ్న సమయం నుంచి గోదావరిలో వరద వేగంగా తగ్గుతుంది. ఈ విధంగా వరద తగ్గితే రెండు రోజుల్లో వరద పూర్తిగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు.

మూసుకోని స్లూయిజ్ తలుపు..

వడ్డిలంక వద్ద నక్కల డ్రెయిన్ అవుట్‌ఫాల్ స్లూయిజ్ తలుపు మూసుకోకపోవడంతో గోదావరిలో నీరు వేగంగా నక్కల డ్రెయిన్‌లోనికి వస్తుంది. దీంతో తలుపు వద్ద ఇసుక బస్తాలు వేయడానికి అధికారులు విఫలయత్నం చేశారు. ఇసుక తీసుకు వచ్చి సంచుల్లో నింపి బస్తాలను పొక్లెయిన్ సహాయంతో మూసుకోని స్లూయిజ్ వద్ద వేశారు. అయితే ఎన్ని బస్తాలు వేసిన నీటిలో కొట్టుకుపోవడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. దీంతో వరద నీరు వేగంగా డ్రెయిన్‌లోనికి ఎదురువచ్చింది. సాయంత్రం నుంచి గోదావరిలో నీరు తగ్గడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆచంటలో..

పెనుగొండ: గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో లంక గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ఈ ఏడాది మూడు సార్లు ముంపునకు గురవుతుండడంతో లంక వాసులు దిక్కు తోచని స్థితిలో అల్లాడి పోతున్నారు. జూలై, ఆగస్టుల్లో చవిచూసిన నష్టాల నుంచే ఇంకా కోలుకోని రైతులు, లంకవాసులు మరోసారి గోదావరి ఉగ్రరూపాన్ని చూస్తున్నారు. ఆచంట మండలంలోని లంకగ్రామాలు పెదమల్లం లంక, అయోధ్య లంక, మర్రిమూల, నేతల వారి పేట, పుచ్చలంక, కోడేరు లంకల్లో ఇప్పటికే వరద నీరు చేరుకుంది. అయోధ్యలంకలోని పంచాయతీ వరకూ వరద నీరు చేరుకొంది. వరద నీరు ఉధృతంగా ఎగువ నుంచి వస్తుండడంతో మరింత మునపుకు గురయ్యే అవకాశం ఉంది. పెదమల్లం లోని ప్రసిద్ధ మాచేనమ్మ ఆలయంలోకి మరోసారి వరద నీరు చేరుకుంది. మరో అడుగు మట్టం పెరిగితే ఆలయ గర్భాలయంలోకి వరద నీరు ప్రవేశిస్తుంది. సిద్ధాంతం మధ్యస్థ లంకకు వరద నీరు చేరుకుంది ఆచంట, పెనుగొండ మండలాల్లోని లంక గ్రామాల్లోని పంట భూములు పూర్తిగా నీట మునగడంతో వేలాది రూపాయలు మరోసారి నష్టపోవాల్సి వస్తుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి రెండు సార్లు వచ్చిన వరద నీటికే పూర్తిగా నష్టపోయామని, ఇప్పటి వరకూ కేవలం నష్ట అంచనాలే వేశారని, ఎటువంటి పరిహారం అందించలేదని వాపోయారు. ఆగష్టులో వరదనీరు తీసిన తరువాత మరోసారి పెట్టుబడులు పెట్టామని, వరద నీటితో నష్టాలపాలయ్యామంటూ వాపోతున్నారు.



పెనుగొండ: అయోధ్యలంకకు చేరిన వరద నీరు



యలమంచిలి: యలమంచిలిలంకలో ప్రధాన రహదారి పై పారుతున్న వరద నీరు

మునగాకులో అధిక పోషక విలువలు

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు ఎక్కువగా తినడం వల్ల రక్త హీనత సమస్య తొలగిపోతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం కాపవరం పంచాయతీ పరిధిలోని చింతలపాలెంలో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు పోషకాహార అవగాహన సదస్సు నిర్వహించారు. మునగాకులో అత్యధిక పోషకాహార విలువలు ఉంటాయన్నారు. గ్రామ సర్పంచ్ కొల్లాటి రాధ, మహిళా పోలీస్ శిరేఖ, ఏఎన్‌ఎం సుజ్ఞానమణి, అంగన్‌వాడీ టీచర్లు మసేనమ్మ, లలితకుమారి, పద్మ, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.



కాపవరంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి

యలమంచిలి: బాలామృతమే పిల్లలకు జీవామృతమని ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ పి నాగరత్నం చెప్పారు. అబ్బిరాజుపాలెంలో గురువారం జరిగిన పోషకాహార మాసోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడం వలన బాలామృతం విలువ తెలుసుకోకుండా దానిని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు, వైద్య సిబ్బంది సీతామహాలక్ష్మి, నిర్మలాకుమారి, జగదీష్, శ్రీలక్ష్మి పంచాయతీ కార్యదర్శి వై సురేష్‌బాబు అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. అలాగే ఆర్యపేట గ్రామంలో కూడా గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిది విజయ జ్ఞానమణి, ఎంపీటీసీ మానుకొండ చిట్టెమ్మ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పౌష్టికాహారంతో ఎంతో మేలు జరిగి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ఏర్పడుతుందని ఐసీడీఎస్ పెనుమంట్ర ప్రాజెక్టు సీడీపీఓ కృష్ణకుమారి అన్నారు. గురువారం వడలి సెక్టార్ పరిధిలోని చినమల్లంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొని అవగాహన కల్పించారు. అలాగే పెనుగొండ సెక్టార్ పరిధిలో చెరుకువాడ యర్రానారాయణ స్వామి కాలనీలో పౌష్టికాహారా మాసోత్సవాలు నిర్వహించిన అవగాహన కల్పించారు. సూపర్‌వైజరు ఎం విజయకుమారి మాట్లాడుతూ పాలు, గుడ్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు, దీని వలన ఎముకుల దృఢత్వం పెరుగుతుందన్నారు.

ఊరూవాడా గణపతి నవరాత్రుల సందడి





పాలకొల్లు సెంట్రల్: గోల్డ్ మార్కెట్ గణపతి మండపం వద్ద కోలాటం చేస్తున్న దృశ్యం, పెనుగొండ: ఎంఎస్ఆర్ నగర్‌లో గణనాథుడు

పెనుగొండ: గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. తొలిపూజలు అందుకునే గణపతికి గురువారం ఆచంట , పెనుగొండ మండలాల్లో ఆరో రోజూ ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పెనుగొండ ఎంఎస్ఆర్ నగర్‌లో ఉదయం నుంచి పూజలు, అన్నదానం నిర్వహించిన అనంతరం నిమజ్జనోత్సవం నిర్వహించారు. పెనుగొండ బస్టాండ్ సెంటర్, గాంధీ బొమ్మల సెంటర్ వేంద్ర వారి వీధి, జవ్వాది వారి వీధి, కంబాల వారి వీధిల్లోపూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధాంతంలో తానేష్ పాలెం శెట్టిబలిజ సంఘం, ప్రకాశరావు నగర్‌లకు చెందిన గణనాథులకు నిమజ్జనోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి, వశిష్ఠా గోదావరిలో నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక గోల్డ్ మార్కెట్‌లో నెలకొల్పిన మండపం వద్ద గురువారం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పట్టణ వ్యాప్తంగా ఆలయాల్లోనూ, కూడళ్లలోనూ నిలబెట్టిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని కాంబొట్లపాలెం గ్రామంలో వినాయకచవితి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గురువారం ఉత్సవాల నిమజ్జన ఊరేగింపును సర్పంచ్ అనిశెట్టి మల్లిక, నవీన్ దంపతులు ప్రారంభించారు. కమిటీ సభ్యులు సూర్యనారాయణ, కృష్ణ, పాపయ్యశాస్త్రి, సుబ్బయ్యశాస్త్రి, చేగొండి మణికంఠ, దివి ప్రకాష్ సహాయం అందించారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజుకు చేరుకోవడంతో నరసాపురం మండలంలోని పలు ప్రాంతాల్లో నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పరసావారిమెరక శివారు ప్రాంతం కైలవారి మెరకలో ఏర్పాటు చేసిన భారీ గణేష్ విగ్రహాన్ని వీధుల గుండా ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామానికి చెందిన కేకేఎస్ వెంకటేశ్వరరావు (62) గత నెల 28న వ్యక్తిగత పనుల నిమిత్తం విజయవాడ వెళ్లాడు. పని ముగించుకుని ఆగష్టు 31న తిరిగి దొడ్డిపట్ల వస్తుండగా హైస్కూల్ వద్దకు వచ్చేసరికి కళ్లు తిరిగి కిందపడపోయాడు. స్థానికులు వెంటనే అతనిని 108 వాహనంపై పాలకొల్లులో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం ఉన్నత వైద్యం నిమిత్తం అతనిని కుటుంబ సభ్యులు భీమవరంలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం కన్నుమూశారు. ఈ మేరకు మృతుని కుమారుడు కాశి విశ్వ ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు.

వీఆర్‌ఓ ఇంట్లో చోరీ

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో సుబ్బయ్యగారి వీధిలో నివాసం ఉంటున్న సారవ గ్రామ వీఆర్‌ఓ కటకంశెట్టి వేణుగోపాల్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్టు ఫిర్యాదు అందిందని పట్టణ సీఐ బి.యాదగిరి గురువారం విలేకరులకు చెప్పారు. ఆసుపత్రి పని నిమిత్తం వేరే ఊరు వెళ్లి గురువారం ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళం బద్దలు గొట్టి ఉంది. ఇంట్లో కొన్ని వెండి వస్తువులు, ల్యాప్‌టాప్ చోరీకి గురయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ చెప్పారు. బాధితుడు మాత్రం 10 తులాల బంగారం కూడా పోయిందని చెబుతున్నాడు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ఉండి: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి బాలాజీరావు పేటకు చెందిన షేక్ మస్తాన్ అనే వ్యక్తిపై ఉండికి చెందిన కాట్రగడ్డ నవీన్ సుధాకర్, సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. తమకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగేందుకు వచ్చి ఈ నెల 10,11వ తేదీల్లో తనతో గొడవపడి తనను కొట్టారని బాధితుడు మస్తాన్ పోలీసులను ఆశ్రయించాడని ఎస్సై నసీరుల్లా తెలిపారు.

సమాచార హక్కు చట్టం ప్రజాయుధం

ఉండి: సమాచార హక్కు చట్టం ప్రజల ఓ గొప్ప ఆయుధం వంటిదని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో సమాచార హక్కు చట్టం 2005పై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బి.సంధ్య సమాచార హక్కు చట్టంలో సమాచారాన్ని ఎలా పొందాలో? వివరించారు.

ప్రభుత్వ వైఫల్యమే విజయవాడను ముంచింది

ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ ముదునూరి



ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ప్రభుత్వ వైఫల్యమే విజయవాడను వరదతో ముంచెత్తిందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ వాసులు గడిచిన నాలుగు దశాబ్దాల్లో ఇలాంటి దారుణమైన విపత్తును చూడలేదన్నారు. రోజులు తరబడి విజయవాడ ప్రజలు పీకల్లోతు నీళ్లలో అష్టకష్టాలు పడ్డారని, లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసే విషయంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ఎన్నడూలేని విధంగా భారీ వర్షాలు పడటం, వరద ముప్పు పొంచి ఉందని వాతావరణశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా సింగ్‌నగర్‌కు బుడమేరు రూపంలో ప్రమాదం పొంచి ఉందనే విషయం గత అనుభవాలు చెపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసాన్ని వరద నీరు ముంచెత్తకూడదనే తాపత్రయంతో బుడమేరుకు గండి పెట్టారన్నారు. కనీసం వరద ప్రమాదం ఉందని ప్రజలను అప్రమత్తం చేసినా కూడా వారు వ్యక్తిగతంగా జాగ్రత్త పడేవారిని పేర్కొన్నారు. సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడం, విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు లాంటి వాటిని కాపాడుకునే అవకాశం ఉండేదన్నారు. ఎత్తయిన భవనాల్లో సైతం గ్రౌండ్ ఫ్లోర్‌లు మునిగిపోవడంతో దారుణ నష్టాలు చూశారన్నారు. పిల్లలతో నీళ్లలో విద్యుత్ లేక, తాగడానికి మంచినీళ్లు లేక నరకం చూశారన్నారు. వరద సహాయక చర్యల్లో కూడా ప్రభుత్వ ప్రతినిధులకు పబ్లిసిటీ యావ తప్ప, ప్రజలను ఆదుకుందామనే తపన కనిపించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అరకొరగా ఆహారం, మంచినీరు అందించారని మండిపడ్డారు. నాలుగున్నర లక్షలమంది ప్రజలు దాదాపు వారం రోజులు పాటు నీళ్లలో బిక్కుబిక్కు మంటూ కాలం గడిపే గడ్డు పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో సర్వం కోల్పోయిన వరద బాధితులను ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేసి ప్రభుత్వం భరోసా ఇవ్వాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న మాలల న్యాయ పోరాట సమితి నాయకులు

నరసాపురం: ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని, సుప్రీం కోర్టు తీర్పుసహేతుకంగా లేదని మాలల న్యాయపోరాట సమితి నరసాపురం నియోజకవర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ అన్నారు. గురువారం ఆ సంఘ నాయకులు నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్‌ను కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలు హక్కులు కోల్పోతారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు న్యాయబద్ధంగా లేదన్నారు. రాజ్యాంగ వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతమవుతాయని పేర్కొన్నారు. తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేయాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో కాకిలేటి ఆనంద్, మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు, ఈదా సురేష్‌బాబు, గమిడి రత్నరాజు, సోడదాసి రత్నరాజు, వర్ధనపు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కుల అందజేత



విద్యార్థులకు చెక్కులను అందిస్తున్న ట్రస్టు బోర్డు నిర్వాహకులు

మొగల్తూరు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచించినట్టుగా విద్యార్థులు తమ కన్న కలలను సాకారం చేసుకోవడానికి కష్టపడాలని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు సూచించారు. మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ పంచాయతీ గ్రామంలోని ఏటిమొండికి చెందిన వీర సీతారామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఏడాది పదో తరగతిలో 450 మార్కులు సాధించిన 50 మంది విద్యార్థులకు రూ.10 వేల విలువైన చెక్కులను ఈ ఏడాది జూన్‌లో అందచేశారు. అందులో మిగిలిన ముగ్గురు విద్యార్థినులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎంపీడీఓ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సీతారామరాజు, ఉపాధ్యాయులు దొంగ చింతయ్య, వాటాల మాధవి, డాక్టర్ నేదునూరి శ్రీనివాస్, ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న జడ్జి వరలక్ష్మి

నరసాపురం: పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌ను గురువారం నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు హాస్టల్‌లో అందుతున్న సదుపాయాలు, ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని, వంటకు తాజా కూరగాయలు వినియోగించాలని చెప్పారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఆమె వెంట లీగల్ సర్వీసెస్ కమిటి సభ్యులు సీహెచ్ దానయ్యనాయుడు, యర్రంశెట్టి ఫణికర్, ఎస్సై ముత్యాలరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగొండ: మండల పరిధిలో విద్యుత్ శాఖ నిర్వహణ పనులతో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.సురేష్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పెనుగొండ, కొఠాలపర్రు, సోమరాజు చెరువు, సిద్ధాంతం, ఇలపర్రు, ములపర్రు, తామరాడ, రామన్నపాలెం, వడలిలలో సరఫరా నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.